సద్దుల బతుకమ్మ ఉయ్యాలో..



చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ.. బంగారు బొమ్మ దొరికేనమ్మో ఈ వాడలోన.. అంటూ పాటలు పాడుతూ మహిళలు బతుకమ్మ ఆడారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. మహిళలు, యువతులతో పాటు చిన్నారులు రంగు రంగు పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ ఆడారు. సాయంత్రం ప్రారంభమైన బతుకమ్మ ఉత్సవాలు రాత్రి వరకు కొనసాగాయి. పిల్లాపాపలతో మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సందడి చేశారు. - రంగారెడ్డినగర్



వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో..

చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో







నిజాంపేట్ కార్పొరేషన్ ఇంద్రప్రస్థ కాలనీలో..



ప్రసూనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు..





కుత్బుల్లాపూర్ గ్రామం వేణుగోపాలస్వామి ఆలయం వద్ద బతుకమ్మ శోభ



పద్మానగర్ ఫేజ్-1లో బతుకమ్మ వేడుకలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడటం ఖాయం

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడటం ఖాయమని, పార్టీలో పెరుగుతున్న చేరికలే ఇందుకు నిదర్శనమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం గాజులరామారం డివిజన్ కైసర్ నగర్‌కు చెందిన డివిజన్ మైనారిటీ ప్రెసిడెంట్ షఫీ ఆధ్వర్యంలో శ్రీనివాస్, శివ, సురేష్ మిత్రబృందంతో. అదే విధంగా గాజులరామారం డివిజన్ ఇందిరానగర్-ఏ బీజేపీ పార్టీ వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ నేత తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన హన్మంతరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగునుందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500లకు గ్యాస్ సిలిండర్, నిరుద్యోగ యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు.

జై మాతా ది

ఆధ్యాత్మికం.. శరన్నవరాత్రి ఉత్సవం



దుర్గామత పూజల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఆదివారం గాజులరామారం చిత్తారమ్మ ఆలయం, సూరారం కట్టమైసమ్మ, కుత్బుల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయం, దూలపల్లిలోని దుర్గామాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు పోటెత్తి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు సామూహిక కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. అదే విధంగా అమ్మవారి మండపాల్లోనూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. - కుత్బుల్లాపూర్



గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు కృష్ణమాచార్యాలు



సూరారంలో పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ కేవీ ముద్దాపురం మదన్‌గౌడ్..



నాగబలి పూజల్లో పాల్గొన్న దుండిగల్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి..

విశేష అలంకరణలో నిజాంపేట్ శ్రీనల్లపోచమ్మ తల్లి





కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలోని దుర్గామాత ఆలయంలో కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు..

ప్రజా సంక్షేమానికి పాటుపడేది బీఆర్ఎస్‌యే..



మాజీ ఎమ్మెల్యే గౌరీష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వివేకానంద్



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ పార్టీ సర్కిల్ సెక్రటరీ బాలయ్యతో ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: గత పాలకులు తమ కుటుంబాల అభివృద్ధి తప్ప నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని.. ప్రజా సంక్షేమానికి పాటుపడేది ఒక్క బీఆర్ఎస్ అని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సుగుమళ్ల బాలయ్య, ఇంద్రసింగ్‌నగర్ మాజీ ప్రెసిడెంట్ మన్నె సత్తయ్యలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అదే విధంగా రంగారెడ్డినగర్ డివిజన్ ఇందిరగాంధీనగర్, గురుమూర్తినగర్‌లకు చెందిన నవాజ్, ఇర్ఫాన్‌ల మిత్ర బృందం, గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్-ఏకు చెందిన బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు సాయి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జయరామ్, బీఆర్ఎస్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, ఓంకార్ రెడ్డి, దేవరకొండ శ్రీనివాస్, సత్తి రెడ్డి, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, సుధాకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బీజేపీ అభ్యర్థిగా కూన శ్రీశైలంగౌడ్ ఎంపిక కావడంతో ఆ పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. 2009లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించి పునర్విభజనలో భాగంగా ఏర్పడ్డ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ మొట్టమొదటి ఎమ్మెల్యేగా చరిత్ర సష్టించగా.. తాజాగా బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉండడంతో మరోసారి ప్రజల ఆశీస్సులతో తప్పకుండా గెలుస్తానని కూన శ్రీశైలం గౌడ్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2014, 2018 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద గెలుపొందగా 2023లో మరోసారి పోటీకి సై అంటున్నారు.

◆ స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన కూన శ్రీశైలం గౌడ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి శిష్యుడిగా ఉంటూ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి కుత్బుల్లాపూర్‌లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. బీసీల్లో బలమైన నాయకుడిగా ఉన్న శ్రీశైలంగౌడ్‌కు బీజేపీ టికెట్ కేటాయించగా నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. శనివారం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ బన్సల్, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఈటల రాజేందర్‌లు ఫోన్‌లో శ్రీశైలంగౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన విషయం తెలిసిందే.. గత సంవత్సర కాలంగా చాప కింద నీరుల పార్టీ డివిజన్, బూత్ స్థాయి లెవెల్‌లో సమావేశాలు నిర్వహిస్తూ బీజేపీ సీనియర్ నాయకులతో మమేకమవుతూ ముందుకు సాగుతున్న నేపథ్యంలో తాజాగా టికెట్ డిక్లేర్ కావడంతో వేగం పెంచారు.

సేవా కార్యక్రమాలు:

కూన కృష్ణ మహాలక్ష్మి(కేకేఎం) చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. కేకేఎం ట్రస్టు ద్వారా తాగునీటి సమస్యలు ఉన్న బస్తీలలో వాటర్ ట్యాంకుల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ, కరోనా సమయంలో కుత్బుల్లాపూర్



నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా నిత్యవసర వస్తువులను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ వివిధ కంపెనీల్లో యూనియన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

రాజకీయ ప్రస్థానం..

యూత్ కాంగ్రెస్ నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, దాదాపు ముప్పై సంవత్సరాలుగా క్రియాశీల రాజకీయాల్లో ఉంటూ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా, 2009లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా కప్పు సాసర్ గుర్తు మీద పోటీ చేసి ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను చిత్తు చేసి భారీ మెజారిటీతో గెలుపొందారు.

బయో డేటా..	
పేరు	కూన శ్రీశైలంగౌడ్
భార్య	మంజుల
పిల్లలు	ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు
తల్లిదండ్రులు	కూన కృష్ణ - మహాలక్ష్మి

పదవులు..

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే (2009-2014)

◆ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ (2004-2009)

◆ హుజూరాబాద్, నాగార్జున సాగర్ ఉపఎన్నికల్లో, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా వ్యవహరించి పార్టీ అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర పోషించారు.

◆ బీజేపీ రాష్ట్ర ఎస్టీ నియోజకవర్గాల కమిటీ సభ్యుడిగా 12 ఎస్టీ నియోజకవర్గాలలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు.

తెలంగాణలో బీజేపీ గాలి వీస్తోంది

◆ కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్

◆ బీజేపీలో చేరిన వివిధ పార్టీల నాయకులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ గాలి వీస్తోందని, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయిబాబానగర్, వీరాస్వామి బస్తీలకు చెందిన కోట రాములు ఆధ్వర్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు నాయకులు, కార్యకర్తలు ఆదివారం శ్రీశైలంగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు తీవ్రంగా మోసపోయారన్నారు. సాయిబాబానగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

◆ జీడిమెట్ల డెకాత్లన్ వద్ద వాకర్స్‌ను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కలిశారు. బీజేపీ మద్దతు ఇచ్చి బంగారు తెలంగాణకు సాధనలో పాలు పంచుకోవాలని కోరారు. ఈ ఎన్నికల్లో బీజేపీ పార్టీకి మద్దతు ఇచ్చి, తనను గెలిపించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ, నాయకులు బుచ్చిరెడ్డి, బలరామ్, బాలప్ప, నల్లా జయశంకర్, నర్సింగ్‌రావు, సందీప్ ఉన్నారు.

బీసీ మహిళలకు టికెట్ల కేటాయించాలి

సుభాష్‌నగర్: తెలంగాణ ఉద్యమంలో లాఠీ దెబ్బలు తిన్న అసలైన కార్యకర్తలను బీఆర్ఎస్ అధినాయకత్వం విస్మరిస్తోందని తెలంగాణ ఉద్యమకారిణి, బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి శోభాకృష్ణాగౌడ్ అన్నారు. ఆదివారం బీసీ మహిళలకు ఎమ్మెల్యే టికెట్ల కేటాయించాలని కోరుతూ బతుకమ్మలతో వినూత్న నిరసన తెలియజేశారు. బీఆర్ఎస్ పార్టీపై తిరుగుబావుటా ఎగురవేసిన శోభాకృష్ణాగౌడ్ మాట్లాడుతూ... ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ టికెట్లు ఇచ్చి సీఎం కేసీఆర్ తెలంగాణ సమాజానికి ఏవిధమైన సాంకేతికాలు ఇస్తున్నారని ప్రశ్నించారు. బతుకమ్మ పండగ సందర్భంగా బీసీ మహిళలకు టికెట్లు కేటాయించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు.